నేడు ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర కమిటీ సమావేశం

మియాపూర్: అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (ఏఐఎఫ్‌డీవై) రాష్ట్ర కమిటీ సమావేశం మియాపూర్ స్టాలిన్‌నగర్‌లో శనివారం జరగనుందని గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ డి.మధుసూదన్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర నాయకులు పెద్దరపు రమేష్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్ర రాజిరెడ్డి, వనం సుధాకర్‌లతో పాటు గ్రేటర్ హైదరాబాద్, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరు అవుతున్నారని సమావేశంలో భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించనున్నామని తెలిపారు.

2న 'గ్లోబల్ పీస్ ర్యాలీ'

హిమాయత్‌నగర్: దేశ ప్రజల సుభిక్షం కోసం కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా గ్లోబల్ పీస్ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 2వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 'గ్లోబల్ పీస్ ర్యాలీ, జాతీయ స్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.పాల్ తెలిపారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ర్యాలీ, సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను సంస్థ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

బంజారాహిల్స్: ఆర్థికంగా వెనుకబడి ఉన్న నిరుద్యోగ యువతకు కంప్యూటర్ విద్యతో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు భారతీయ విద్యా భవన్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరామ్ తెలిపారు. కంప్యూటర్ సంబంధిత కోర్సులు ఆఫీస్ అసిస్టెంట్ కోర్సు, అకౌంట్ అసిస్టెంట్ కోర్సులను ట్యాలీ ప్రైమ్, డీటీపీతో కలిపి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 24 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 18 లోపు తమ దరఖాస్తులను ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు కింగ్ కోఠి బషీర్‌బాగ్‌లోని కులపతి మున్షీ సదన్‌లోని భారతీయ విద్యాభవన్‌లో అందజేయాలన్నారు. 17 ఏళ్ల నుంచి 34 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ ఉండాలని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికే ప్రాధాన్యం ఉంటుందన్నారు. వివరాలకు ఫోన్: 040 2324 1629లో సంప్రదించాలన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులకు సైబర్ క్రైమ్ సీఐ రవికుమార్ అవగాహన కల్పించారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని ఆర్ జిన్ స్కూల్లో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన నియమాలు ,సైబర్ నేరగాళ్లను ఎలా గుర్తించాలి అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు.అదే విధంగా విద్యార్థులు తల్లిదండ్రులకు తాము తెలుసుకున్న విషయాలను చెప్పాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు సోషల్ మీడియా ఎక్కువ వాడతారని, సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా వేదికగా యువతను టార్గెట్ చేసుకొని నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తి నుండి వచ్చే రిక్వెస్ట్ లను గుడ్డిగా నమ్మొద్దని, సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను నమ్మకూడదన్నారు ఏదైనా సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ జగదీష్, కానిస్టేబుల్ సతీష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరుపత్రం అందజేత

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్‌కి చెందిన మహ్మద్ అబ్దుల్ జాఫర్‌కు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎం సహాయనిధి రూ.1.50 లక్షలు మంజూరుపత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, పోతుల రాజేందర్, నాయకులు కాశినాథ్ యాదవ్, జోగిపేట భాస్కర్, గుడ్ల ధనలక్ష్మి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెదర్లాండ్స్ యూనివర్సిటీలో పత్ర సమర్పణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిని నెదర్లాండ్స్‌లోని యుట్రెక్ట్ విశ్వవిద్యాలయంలో పత్రసమర్పణ చేశారు.హెచ్‌సీయూలోని సరోజినినాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్‌లోని డ్యాన్స్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని పి.బి.వైష్ణవి డాక్టోరల్ కన్సార్టియంలో 'ట్రేసింగ్ ది డైనమిక్స్ ఆఫ్ మూవ్‌మెంట్ : ఇన్‌సైట్స్ ఫ్రమ్ ఇండియన్ టెక్స్టువల్ సోర్సెస్' వ్యాసం సమర్పించారు. ఆమె హెచ్‌సీయూలోని ప్రొఫెసర్ జే అనురాధ పర్యవేక్షణలో పనిచేస్తున్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

జిల్లా కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థి దశలో కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల హాస్టల్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కిచెన్‌షెడ్ ,స్టోర్ రూమ్, భోజనశాలను ఆమె పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ఆమె మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో రెజ్లింగ్ శిక్షణను పరిశీలించారు. విద్యార్థులు ఇప్పటి వరకు 11 సార్లు రెజ్లింగ్ స్టేట్ ఛాంపియన్‌షిప్, రెండుసార్లు నేషనల్ మెడల్స్ పొందినట్లు పాఠశాల రెజ్లింగ్ కోచ్ ప్రియాంక కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దేవుజ, తహసీల్దార్ రంగారావు, కళాశాల ఆర్సీఓ భీమయ్య, ప్రిన్సిపల్ యోగేందర్, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, ఎంపీడీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ ఫిల్మ్ వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

హిమాయత్‌నగర్: హైదరాబాద్ నగరంలోని బ్లాక్ ఫిల్మ్ వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నాలుగు రోజుల్లో 1007 కేసులు నమోదు చేసి, వాహనాలకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌ను తొలగించామని నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ పి.విశ్వప్రసాద్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 4 రోజులలో సీఎంవీ రూల్ 100-సెక్షన్ 177,179 (1) మోటారు వాహనాల చట్టం 1988 కింద మొత్తం 1007 కేసులు నమోదు చేసి, వాహనదారులకు రూ.1000 జరిమాన విధించినట్లు తెలిపారు. ఈ బ్లాక్ ఫిల్మ్ వేయించడం ట్రాఫిక్ ఉల్లంఘనలకు మాత్రమే కాకుండా, నేర కార్యకలాపాలకు కూడా దోహదపడేవిగా ఉంటాయన్నారు. సుప్రీం కోర్టు, సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్ 100 ప్రకారం, వాహన తయారీదారులు ముందు విండ్‌స్క్రీన్, వెనుక కిటికీలకు 70 శాతం విజువల్ ట్రాన్స్‌మిషన్‌ను అందించాలని, పక్క కిటికీలకు 50 శాతం కంటే తక్కువ కాకుండా ఉండాలన్నారు.


మాలబస్తీలో మ్యాన్‌హోల్ మూతగా కుర్చీ..


షేర్‌గల్లీలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


అంజయ్యనగర్ కమ్యూనిటీహాల్ వద్ద ఇలా..

మ్యాన్‌హెల్స్

పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు


అంజయ్యనగర్‌లో అధ్వానంగా మ్యాన్‌హోల్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాల మీదకు వస్తోంది. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. వాటి నిర్వహణకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తూనే ఉన్నా ధ్వంసమై కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లకు మూతలు లేకపోవడంతో వాటికి అడ్డుగా కుర్చీలు, చెట్ల కొమ్మలు, రాళ్లను పెడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడంతో మన కర్మ ఇంతేలేనని సర్దుకుని వెళుతున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలలో సీసీ రోడ్డులు నిర్మించిన ప్రాంతాలలో కూడా మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారడం ప్రజలను కలవర పెడుతున్నాయి. మ్యాన్‌హోళ్లు రోడ్డుకు సమాంతరంగా ఉండాలి కాని అవి ఒక ఫీట్ కుంగిపోయి కిందికి ఉంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఒక ఫీట్ పైకి ఎత్తుగా ఉంటున్నాయి.

◆ ముఖ్యంగా షేర్‌గల్లీ, హస్మత్‌పేట, ఎల్‌బీనగర్, మాలాబస్తీ, కోయబస్తీ, విఠల్ ఎన్‌క్లేవ్, ఆర్ఆర్‌నగర్, సత్యసాయినగర్, భవానీనగర్, బడేగూడ, ముస్లిం బస్తీ, అంజయ్యనగర్ వంటి పలు ప్రాంతాలలో మూతలు లేని మ్యాన్‌హోళ్లు కనిపిస్తాయి.

తొలగించిన వ్యర్థాలు అక్కడే..

కొన్ని ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల నుంచి తొలగించిన వ్యర్థాలను అక్కడే వదిలేస్తున్నారు. వర్షం పడినప్పుడు ఆ వ్యర్థాలు తిరిగి మ్యాన్‌హోల్‌లోకి వెళ్లడంతో పాటు రోడ్లపై పాకుతోంది. ఈ విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాటర్ వర్క్స్ మేనేజర్, వర్క్ ఇన్‌స్పెక్టర్, ఆఫీస్ ఇన్‌చార్జిలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులతో పాటు వాటికి మూతలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే....



అధికారుల నిర్లక్ష్యంతోనే మ్యాన్‌హోళ్ల దుస్థితి ఇలా తయారైంది. మ్యాన్‌హోళ్లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తే సమస్యలు జఠిలంగా మారేవి కావు. అధికారులు ఇప్పటికైనా మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలి. పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోళ్లకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– మహమ్మద్ జహంగీర్,కాంగ్రెస్ నాయకుడు

సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటా

కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లోని సీనియర్ సిటిజన్స్ కష్ట సుఖాలను పంచుకుని వారికి అండగా ఉంటానని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. స్నేహ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పీవీఎన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సీనియర్ సిటిజన్స్ క్యారమ్స్, చెస్ గేమ్‌లలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ టోర్నమెంట్‌లో 150 మందికి పైగా సీనియర్ సిటిజన్స్ పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బానయ్య, ప్రధాన కార్యదర్శి శేషసాయి, కోశాధికారి శాస్త్రి, కమిటీ సభ్యులు శ్యామ్‌సుందర్, సూర్యప్రకాశ్, సుధాకర్‌రావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్


సీనియర్ సిటిజన్స్‌తో కలసి క్యారమ్స్ ఆడుతూ..

'ఫ్రై-డే.. డ్రై-డే'లో భాగస్వాములు కావాలి

● ఎంటమాలజీ సిబ్బందికి సహకరించాలి ● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి 'ఫ్రై-డే.. డ్రై-డే'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మన ఇంటి ఆవరణలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని అన్నారు. అందుకే ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. దోమ కాటుతో వచ్చే వ్యాధులపై నిర్వహించే అవగాహన సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. అదే విధంగా ఉదయం ప్రతి ఇంటికి వెళ్లి నీటి నిల్వలను తనిఖీ చేసే ఎంటమాలజీ సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీ కృష్ణయ్య, సర్కిల్ 24 ఎస్‌డబ్ల్యూఎం మోహన్‌రెడ్డి, ఏఎంహెచ్ఓ మమతా, ఎంటమాలజీ ఏఈ ఉష తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ బస్తీలోని ఆలీతలాబ్ వద్ద ఉన్న హిందూ శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కూకట్‌పల్లి మున్సిపల్ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు కూకట్‌పల్లి సీపీఎం మండల కమిటీ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ శ్మశాన వాటికలో వీధిలైట్లు, స్నానాల గదులు నిర్మించాలని కోరారు. సమస్యలపై స్పందించిన జెడ్‌సీ అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.


జెడ్‌సీ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేసిన సీపీఎం నాయకులు

కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.శంకర్, బి. శ్రీను, మహేష్, అశోక్ యాదవ్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


అవగాహన కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఎంటమాలజీ సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: శంషీగూడ ప్రభుత్వ పాఠశాలలో దోమల నివారణపై శుక్రవారం ఎంటమాలజీ సిబ్బంది విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ప్రతి శుక్రవారం 'ఫ్రై-డే.. డ్రై-డే'కార్యక్రమం నిర్వహించుకోవాలన్నారు. ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు చెప్పిన విధంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మన ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహులు, ప్రైమరీ హెచ్‌ఎం సుందరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలి

బీజేపీ నేత విజిత్ వర్మ



కూకట్‌పల్లి: ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలని రాష్ట్ర బీజేపీ నాయకులు విజిత్ వర్మ పేర్కొన్నారు. జేఎన్‌టీయూలో భవన ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 13న విచ్చేయనున్నారని తెలిపారు. ఈ యూనివర్సిటీ కూకట్‌పల్లి నియోజకవర్గం, మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోకి వస్తుందన్నారు. ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం తలపెట్టినా పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. కానీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజుందర్‌ను ఆహ్వానించకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

ఆర్థిక సాయం



ఆల్విన్‌కాలనీ: జన్మభూమి కాలనీలో నివాసించే బాలస్వామి అనే వృద్ధుడు డాబా మీద నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్ ఓలమ్మ, బాలస్వామి దంపతులకు శుక్రవారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రెహమాన్, మనమ్మ పాల్గొన్నారు.

చిట్టీ డబ్బులు ఇవ్వలేదని వాచ్‌మెన్ ఆత్మహత్య

- డబ్బులు అడిగిన పాపానికి కొట్టి గెంటేసిన ఉషారాణి దంపతులు
- అవమానం భరించలేక విద్యుత్ వైర్లు పట్టుకొని ఆత్మహత్య
- మృతుడి కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు


కనకరాజు (ఫైల్)


అపార్టుమెంట్ పార్కింగ్‌లో విద్యుత్ వైర్లు పట్టుకొని ఆత్మహత్య చేసుకున్న కనకరాజు


కనకరాజు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న అపార్టుమెంట్

మోతీనగర్: కట్టిన చిట్టీల డబ్బులు తిరిగి ఇవ్వకుండా వేధించినందుకు మనస్థాపానికి గురైన ఓ వాచ్‌మెన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు శుక్రవారం చేసుకుంది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లాకు చిల్పూరుకు చెందిన భోనగిరి కనకరాజు (40) భార్య, కుమారుడితో కలిసి మూసాపేట, ప్రగతినగర్‌లోని శ్రీసాయికృష్ణ క్లాసిక్ అపార్టుమెంట్‌లో పదేళ్లుగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అదే అపార్టుమెంట్‌లో ఉంటున్న ఉషారాణి చిట్టీల వ్యాపారం చేస్తుండగా ఆమె దగ్గర కనకరాజు చిట్టీలు వేశాడు. డబ్బులు ఇవ్వాలని కనకరాజు అడిగితే ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్థాపం చెందిన కననరాజు అపార్టుమెంట్ పార్కింగ్‌లో మెయిన్ పవర్ సప్లయ్ బోర్డు వద్ద విద్యుత్ వైర్లు పట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.18లక్షలు ఇవ్వాలని అడిగితే...

గత 27 నెలలుగా ప్రతి నెలా చిట్టి డబ్బులు కట్టామని.. మరో 3 నెలల్లో చిట్టీలు పూర్తి అవుతాయని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. చెంగిచర్లలో ప్లాట్ కొనేందుకు తమకు రావాల్సిన డబ్బు రూ.18లక్షలు ఇవ్వాలని అడిగితే "నీకు ఎందుకు డబ్బులు ఇవ్వాలి.. మొత్తం డబ్బులు ఇచ్చేశామని.. నువ్వే డబ్బులు కట్టాలి"అని అనడంతో గొడవ జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో ఫిబ్రవరి నెలలో కనకరాజు పెద్ద కుమారుడి వివాహం చేసే సమయంలో కూడా డబ్బులు అడిగితే ఇవ్వలేదని తెలిపారు.

కొట్టి బయటకు తోసివేసి గేటుకు తాళం..

◆ ఉషారాణి, ఆమె భర్త ఇద్దరు కలిసి కనకరాజు దంపతులు, కుమారులను కొట్టి అపార్టుమెంట్ బయటకు తోసివేసి గేటుకు తాళం వేశారన్నారు. దీంతో మనస్థాపానికి గురైన కనకరాజు భార్య ఇళ్లల్లో పనిచేసేందుకు వెళ్లగా చిన్న కొడుకును పాల ప్యాకెట్ తెమ్మని పంపించి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తమకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, నాయకులు జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కోరారు. రహదారులపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేసి దారి గుండా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. ఓపెన్ నాలాలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, గుర్రపుడెక్కను తొలగించాలని కోరారు. చెరువుల్లో మలేరియా బాల్స్ వేసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవసరమున్న ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా అంధకారంలో ఉన్న గల్లీలు, కాలనీల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ... తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులను సమన్వయం చేస్తూ పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, నాయకుల తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మణ్, విఠల్ రెడ్డి, రాఘవేంద్రరావు, ప్రవీణ్‌కుమార్, కృష్ణ రాజ్‌పుత్ తదితరులు పాల్గొన్నారు.

కీసర దాయర దళితుల భూములను వారికే కేటాయించాలి

కలెక్టర్ గౌతమ్‌కు మాజీ ఎంపీ హన్మంతరావు వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని కీసర దాయర రెవెన్యూ పరిధిలో దళితుల కుటుంబాలకు కేటాయించిన ప్రభుత్వ భూమి వారికే దక్కేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను మాజీ ఎంపీ ఎం.హాన్మంతరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు ఎంహెచ్ వినతి పత్రం అందజేశారు. కీసర దాయర రెవెన్యూ పరిధిలో 94.06ఎకరాల భూమిని అప్పటి ప్రధాని ఇందిరాగాంధి ఇచ్చినట్లు హన్మంతరావు పేర్కొన్నారు. 2008లో దళితులకు ఏలాంటి నోటీసులు ఇవ్వకుండా కీసర ఎంఆర్ఓ వారి పేర్లను తొలగించి,రాగి కృష్ణారెడి, రాగి జానకిరెడ్డి, రాగి కృష్ణ, అనితారెడ్డి, అరుణారెడ్డి పేర్లను నమోదు చేసినట్లు తెలిపారు. దళితులు రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానంలో కేసు వేయగా, పరిశీలించిన న్యాయస్థానం 2018 జులై17న అర్డర్ ఇవ్వాలని అప్పటి జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. అలాగే, సివిల్ కోర్టులో కేసు వేయగా, దీనిపై విచారణ కొనసాగుతుందన్నారు. ఇదిలా ఉండగానే కోర్టును ధిక్కరిస్తూ.. రాగి కుటుంబ సభ్యులు ఈ భూములను విక్రయిస్తున్నారని హన్మంతరావు ఆరోపించారు. జిల్లా కలెక్టర్ పి.గౌతమ్‌ను కలసిన వారిలో మాజీ ఎంపీ వి.హనుమంతరావుతోపాటు పీసీసీ ఎస్సీ సెల్ వైస్‌చైర్మన్ రమేష్, పీసీసీ కార్యదర్శి అఫ్సర్ యూసఫ్ జాహి, భూమి బాధితులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశానికి హాజరైన నేతలు

కూకట్‌పల్లి: శంషాబాద్‌లోని మల్లికా గార్డెన్స్‌లో శుక్రవారం రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కూకట్‌పల్లి నాయకులు నాయిని సూర్యప్రకాష్‌రావు, అర్సనపల్లి సూర్యరావు, శ్రీకర్‌రావు పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో బదిలీల సందడి

జీవో జారీ చేసిన ప్రభుత్వం

- జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు
- 4 ఏళ్లు దాటిన ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాతో పాటు జోనల్, రాష్ట్ర స్థాయి ఉద్యోగుల బదిలీ ప్రక్రియను ఈనెల 20లోగా ముగించాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో ఉద్యోగుల్లో బదిలీలకు సంబంధించిన దరఖాస్తుల సందడి నెలకొంది. రాష్ట్ర ఆవిర్భావం నుంచి పలువురు ఉద్యోగులు జిల్లాలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు 10 మంది వరకు బదిలీ అయ్యే అవకాశముంది. ప్రభుత్వ నిబంధనల మేరకు నాలుగేళ్ల సర్వీసు నిండిన వారందరు బదిలీ కానున్నారు. ఈ ప్రక్రియ జిల్లా, జోనల్ పరిధిలో జరుగనుంది.

కమిటీల ఏర్పాటుకు కసరత్తు

బదిలీలను నిర్వహించేందుకు ప్రతి శాఖలో ప్రత్యేకంగా కమిటీలను వేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. మల్టీజోన్ లేదా జోనల్ స్థాయి ఉద్యోగుల కోసం శాఖాధిపతి అదనపు కార్యదర్శి, జాయింట్ డైరెక్టర్ సభ్యులుగా కమిటీ ఏర్పడనుంది. జిల్లా స్థాయిలో కలెక్టర్, అదనపు కలెక్టర్, సంబంధిత శాఖ అధికారి సభ్యులుగా ఉండనున్నారు.



నాలుగు స్థాయిల్లో..

బదిలీల ప్రక్రియ నాలుగు స్థాయిల్లో స్థానచలనం కల్పించనున్నారు. ఇందులో జిల్లా స్థాయిలో అటెండర్ మొదలుకొని రికార్డు అసిస్టెంట్, టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్లు జిల్లాలోని మండలాల పరిధిలో బదిలీ కానున్నారు. ఇక జోన్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్లు మొదలుకొని సూపరింటెండెంట్, డిప్యూటీ తహసీల్దార్లు, గ్రేడ్ 1, 2, 3 పంచాయతీ కార్యదర్శులు, హెచ్‌ఐడబ్ల్యూవో, ఏఎన్ఎం, స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నిషియన్, వెటర్నరీ అసిస్టెంట్, వంటి హోదా కలిగిన ఉద్యోగులకు జోన్ పరిధిలోని జిల్లాల పరిధిలో బదిలీలు జరగనున్నాయి. ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవో, వ్యవసాయాధికారి, ఏఈఈలు, ఏఎసీడబ్ల్యూవో, ఏటీవో, మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ సివిల్ సర్జన్ వంటి క్యాడర్లో పని చేసే వారికి మల్టీజోన్ పరిధిలో బదిలీ కానుంది. జిల్లా అధికారులతో పాటు సివిల్ సర్జన్లు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లకు రాష్ట్ర స్థాయిలో బదిలీలు జరగనున్నాయి.

జిల్లాల పరిధిలో

ఉద్యోగాల భర్తీకి రాష్ట్రాన్ని ఏడు జోన్లుగా విభజించిన విషయం తెలిసిందే. జోన్ల ఏర్పాటు తర్వాత తొలిసారి బదిలీలు జరగనుండడంతో ఆయా జిల్లాల పరిధిలోని ఖాళీలు, సీనియార్టీ జాబితాలను ఆరా తీస్తున్నారు. జిల్లా స్థాయి ఉద్యోగులకు జిల్లా పరిధిలోనే స్థానచలనం కలగనుంది. నాలుగేళ్లకు మించి ఒకే చోట పనిచేస్తున్న వారి జాబితా విడుదల కానుంది.

కొరవడిన స్పష్టత..

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలో మూడేళ్ల సర్వీసు నిండిన తహసీల్దార్, ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి పలువురు రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులు బదిలీపై వచ్చారు. ఎన్నికల ప్రక్రియ పూర్తవడంతో వీరు సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం వీరిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈ ఉద్యోగుల బదిలీపై స్పష్టత కొరవడింది.